ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 6 ఆగస్టు 2024



రాజన్న ఆలయానికి శ్రావణ శోభ

- బ్రేక్ దర్శనం ప్రారంభం



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

7లో..



సెస్‌కు బకాయిల భారం

- పేరుకుపోయిన రూ.769.69 కోట్లు
- పవర్‌లూం విద్యుత్ సబ్సిడీ బకాయి రూ.89.94 కోట్లు
- సమస్యగా మారిన ఎస్ఎస్ఐ యూనిట్ల బకాయిలు
- పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీల బకాయిలు రూ.319.50 కోట్లు
- రెగ్యులర్ బకాయిలు రూ.134 కోట్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సెస్‌కు బకాయిలు గుదిబండగా మారాయి. కరెంట్ బిల్లుల చెల్లింపులో కాస్త అలస్యమైతేనే విని యోగదా రులపై అపరాధ రుసుం విధిస్తారు. గడువు దాటిపోతే కనెక్షన్ తొలగిస్తారు. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకుంటే మాత్రం ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) వెలుగులను పంచుతూ దేశంలోనే సహకార రంగంలో అగ్రగామిగా నిలిచింది. ప్రస్తుతం సంస్థకు పేరుకుపోయిన బకాయిలతో పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. ప్రభుత్వం, ఇతర విభాగాల నుంచి సిరిసిల్ల సెస్‌కు రావాల్సిన బకాయిలు రూ .769.69 కోట్లు ఉంది. ప్రభుత్వంలోని ఆయా శాఖలకు నిధులు రాక విద్యుత్ బిల్లుల చెల్లింపులు భారంగా మారినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం చేపట్టిన పథకాలకు సంబంధించిన బకాయిలు కూడా రావడం లేదు. గత ప్రభుత్వ హయాం నుంచి బీఆర్ఎస్‌కు చెందిన వారే పాలకవర్గంగా ఉన్నారు. దీంతో సెస్‌కు రావాల్సిన బకాయిలు, సెస్ చెల్లించాల్సిన బకాయిలపై చర్చ లేకుండానే సాగిపోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో విదుత్ బకాయిల చర్చ జోరుగా సాగుతోంది. మరోవైపు మరమగ్గాలకు రావాల్సిన విద్యుత్ సబ్సిడీ పేరుకుపోగా, 10 హెచ్‌పీల వరకు రాయితీ, అంతకంటే ఎక్కువగా వినియోగిస్తున్న పారిశ్రామికులకు సంబంధించి కార్ఖానాలు, ఎస్ఎస్ఐ యూనిట్ల విద్యుత్ సమస్య ఎదురవుతోంది. కోర్టు ఆదేశాల మేరకు ఎస్ఎస్ఐ యూనిట్ల నుంచి రూ.20.20 కోట్ల బిల్లులు వసూలు చేయాల్సిన పరిస్థితి. మరోవైపు 50 శాతం విద్యుత్ రాయితీకి సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.89.94 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సిరిసిల్లలో 5085 పవర్‌లూం సర్వీస్ కనెక్షన్లు ఉండగా పది హెచ్‌పీల వరకు విద్యుత్ వినియోగిస్తున్న పవర్‌లూం సర్వీసులు 3725 ఉన్నాయి. 10 హెచ్‌పీల పైన వినియోగిస్తున్న మరమగ్గాల కార్ఖానాలు 1360 సర్వీసులు ఉన్నాయి. ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు 608 ఎస్ఎస్ఐ యూనిట్ల సర్వీసులకు సంబంధించిన బకాయిలు సమస్యగా మారాయి. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పవర్‌లూం పారిశ్రామికులు, ఆసాములు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

● బకాయిల భారం

జిల్లాలో చీకట్లను పారద్రోలి వెలుగులు నిపండానికి 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ప్రస్తుతం 2 లక్షల 76 వేల 568 మంది సభ్యులు ఉన్నారు. కనెక్షన్లు 1,69,864 వాణిజ్య కనెక్షన్లు 20,297 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 2079, పవర్‌లూం కనెక్షన్లు 5085, వ్యవసాయ కనెక్షన్లు 75,595, గ్రామ పంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3706 దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల కనెక్షన్లు, విద్యుత్ రంగంలోనే ప్రత్యేకతను సాధించిన సెస్‌కు ప్రభుత్వం, వినియోగదారులు, వివిధ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారాయి. ప్రస్తుతం సెస్‌కు రూ.769.69 కోట్ల బకాయిలు రావాలి. ఇందులో రెగ్యులర్‌గా వసూలు కావాల్సిన బిల్లులు రూ.134.26 కోట్లు ఉన్నాయి. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ.89.94 కోట్లు, ప్రభత్వం నుంచి రావాలి. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి సంబంధించిన నీటిసరఫరా, వీధి దీపాలకు సంబంధించి 31 జూన్ 2020 నాటికి రూ.319.52 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. ఇదే సందర్భంలో గత ప్రభుత్వం ఆ బకాయిలను పెండింగ్‌లోనే ఉంచి ఆర్థిక సంఘం నిధుల నుంచి రెగ్యులర్‌గా చెల్లించే విధంగా చర్యలు చేపట్టినా తరువాత మళ్లీ బకాయిలు చెల్లింపు నెమ్మదించిందని చెప్పుకోవచ్చు. సిరిసిల్ల వేములవాడ రెండు మున్సిపాలిటీలతోపాటు 255 గ్రామ పంచాయతీల్లోనూ వీధి దీపాలు, నీటి కనెక్షన్లకు సంబంధించి తాజా బకాయిలు రూ.26.76 కోట్లకు చేరుకున్నాయి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి సంబంధించి రూ.9.06 కోట్లకు చేరుకుంది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు 1049 ఉండగా వీటికి సంబంధించి రూ.4.48 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయి. జిల్లాలో సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ.40.59 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. గృహాలకు సంబంధించి రూ.40.59 కోట్లు, కమర్షియల్‌కు సంబంధించి రూ.15.25 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ.36.57 కోట్లు, మరమగ్గాల పరిశ్రమ నుంచి రూ.1.52 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఎస్ఎస్ఐ యూనిట్లకు సంబంధించి రూ.20.20 కోట్లు బాకీలు ఉన్నాయి. దీంతోపాటు పల్లె, పట్టణ ప్రగతికి సంబంధించి చేపట్టిన పనుల బిల్లులు రూ.26.31 కోట్ల వరకు పేరుకుపోయాయి.

అన్ని కేటగిరీల ద్వారా రెగ్యులర్ బకాయిలు (రూపాయల్లో)

మండలం	బకాయిలు
సిరిసిల్ల	43,87,43,395.46
వేములవాడ టౌన్	10,28,75,994.31
వేములవాడ రూరల్	2,41,07,696.50
వేములవాడ అర్బన్	5,16,41,274.88
చందుర్తి	3,19,79,175.15
కోనరావుపేట	64,81,18,794.94
బోయినపల్లి	8,20,44,395.70
ఎల్లారెడ్డిపేట	12,85,27,562.77
గంభీరావుపేట	9,75,89,988.96
ముస్తాబాద్	9,06,03,585.48
ఇల్లంతకుంట	11,06,69,158.34
తంగళ్లపల్లి	11,90,54,394.87

బాధితులకు సత్వర న్యాయం కోసమే గ్రీవెన్స్‌డే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5: బాధితులకు సత్వర న్యాయం కోసమే గ్రీవెన్స్ డే ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా 14 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామన్నారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

ఇల్లంతకుంట, ఆగస్టు 5: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేయనున్నట్లు యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

గల్ఫ్ ప్రవాసులు ప్రజావాణిని వినియోగించుకోవాలి

ముస్తాబాద్, ఆగస్టు 5:గల్ఫ్‌ప్రవాసులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని టీపీసీసీ ఎన్ఆర్ఐ విభాగం జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

జడ్పీ సీఈవోగా వినోద్

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ జడ్పీ సీఈవోగా ఎస్.వినోద్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం సీఈవోగా పనిచేస్తున్న వినోద్‌ను సిరిసిల్లకు బదిలీ చేశారు. సిరిసిల్ల సీఈవో పనిచేసిన ఉమారాణి వారం రోజుల క్రితం హైదరాబాద్ గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీపై వెళ్లారు.

వర్షాకాలం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వసంతరావు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5: వర్షాకాలం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వర్షాకా లంలో వ్యాధులపై ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలోని పాథలాజికల్ ల్యాబ్ టెక్నీషయన్స్, హెల్త్ అసిస్టెంట్స్‌కు అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది లింగం, రాజ్‌కుమార్, బాలయ్య పాల్గొన్నారు.

నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండ

ఇల్లంతకుంట, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా ఆరోగ్యశ్రీ పరిధిని పెంచామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వాటికి సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఎంపీడీవో శశికళ, డీటీ సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

తంగళ్లపల్లి, ఆగస్టు 5: తంగళ్లపల్లి మండల కేంద్రంలో మార్కండేయ దేవాలయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్, డాక్టర్ సురసుర రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సురసుర రాధాకృష్ణ, జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హమీద్, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ అక్బర్, హ్యూమన్ రైట్స్ సభ్యులు షాహేదాబేగం, దాసరి వెంకటేశం, నవీన్, కోడం మైసయ్య, కైరం కొండ బాలకృష్ణ, జక్కుల అన్వేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 5: చేపట్టిన పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని పేర్కొంటూ భోజనశాలకు వెళ్లకుండా విద్యార్థులను అడ్డుకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. పాఠశాలలో భోజనశాల పనులు పూర్తయిన అందులో భోజనాలు చేయకుండా కాంట్రాక్టర్ అడ్డుకుంటున్నారన్నారు. బిల్లులు అందకపోవడంతో విద్యార్థులను వెళ్లనీయడం లేదని కాంట్రాక్టర్ పేర్కొంటున్నాడని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించాలని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5: వాహనాలను నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల ఆర్టీసీ డిపో కార్యాలయం ఆవరణలో డిపో మేనేజర్ ప్రకాష్‌రావు అధ్యక్షతన బస్సు డ్రైవర్లకు జీరో ఆక్సిడెంట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను జాగ్రత్తగా గమ్య స్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లపై ఉంటుందన్నారు. కొంత మంది డ్రైవర్లు బస్సు నడుపుతూ చేసే పొరపాట్లతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అప్రమత్తంగా ఉంటూ ఆర్టీసీ ఆదాయం పెంచే విధంగా పని చేయాలని సూచించారు. డిపో సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, హెడ్‌గార్డ్ రవీందర్‌రెడ్డి, టీఐ2 రాజమౌళి, టీఐ3 రామకృష్ణ, సేఫ్టీ గార్డెన్ రాంరెడ్డినాయక్, ఎస్‌డీఐ సదానందం, మల్లేశం, ప్రవీణ్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమస్యలు విన్నవించుకోవడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. భూ సమస్యలు, రేషన్‌కార్డు, పింఛన్, వ్యవసాయం, అటవీ శాఖకు సంబంధించిన సమస్యలపై అర్జీలు సమర్పించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 112 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ దరఖాస్తులను స్వీకరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన జక్కు వెంకటి తనకు రుణమాఫీకాలేదని పేర్కొన్నాడు. రేషన్‌కార్డులో పేరు తీసివేశారని, సమస్యను పరిష్కరించాలని కోరాడు. రంగరాయిని చెరువుకు సంబంధించి 45 ఎకరాల వరకు కబ్జాకు గురైందని, చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని కోనరావుపేట మండలం వట్టిమల్ల, కమ్మరిపేట తండా, భూక్యరెడ్డి తండా, అజ్మీరా తండా, గొల్లపల్లికి చెందిన ప్రజలు కోరారు. గంభీరావుపేట వీవో తరచూ మారుతుండడంతో పర్యవేక్షణ లోపం తలెత్తుతోందని, గ్రేడ్-1 ఈవోను నియమించాలని ప్రజలు కోరారు. కుక్కలు, కోతులతో ఇబ్బందులు పడుతున్నామని, వాటి నుంచి కాపాడాలని కోరారు. డెంగ్యూ, మలేరియా విజృంభించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 69, సిరిసిల్ల మున్సిపల్‌కు 16, ఉపాధి కల్పనకు 8, పంచాయతీ శాఖకు 4, డీసీసీడీవో 3, డీఎంఅండ్‌హెచ్‌వోకు 2, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, బోయినపల్లి, వేములవాడ మున్సిపల్ అటవీశాఖ, వ్యవసాయశాఖ, ఎల్‌డీఎం ఇతర శాఖలకు దరఖాస్తులు వచ్చాయి.

స్థానిక రైతులకు అందాకే దిగువకు నీరు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఆగస్టు 5: అన్నపూర్ణ రిజర్వాయర్ పరిధిలోని రైతులకు సాగునీరు అందిన తర్వాతే రంగనాయకసాగర్‌కు నీటిని విడుదల చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులకు సూచించారు. మధ్యమానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యాసంగి సీజన్‌లో ఇక్కడి రైతుల ప్రయోజనాలను విస్మరించి రంగనాయకసాగర్‌కు నీటిని విడుదల చేశారని, ఇప్పుడు అలాంటి తప్పిదాలు చేయవద్దని అన్నారు. ప్రస్తుతం రెండు పంపుల ద్వారా 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్లు చెప్పారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నిండితే ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈ దేవేందర్, ఏఈ సమరసేన, మాజీ ప్యాక్స్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, నాయకులు నవీన్ రెడ్డి, నాగయ్య, గోపాల్, అంతగిరి, రజనీకాంత్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు స్పందన

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు స్పందన లభించింది. 10వ తెలంగాణ సీనియర్స్, 12 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలకు అథ్లెటిక్స్‌లోని వివిధ విభాగాలలో ఎంపిక పోటీలను సోమవారం ప్రారంభించారు. సాయంత్రం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో విజేతలకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా స్థాయిలో పది మందిని ఎంపిక చేశామన్నారు. ఈ నెల 10న మెదక్ జిల్లా ఇందిరా స్టేడియంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు నేరెళ్ల గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

బోయినపల్లి, ఆగస్టు 5: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని మొగులోజి లికిత తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సోమవారం అభినందించారు. రూ.5 వేల నగదు ప్రోత్సాహంగా అందించారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బాబు, నక్క శ్రీకాంత్ పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ యథావిధిగా కొనసాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యథావిధిగా కొనసాగాలని, మార్కెట్‌తో పోటీపడి ఉత్పత్తులు చేపట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి పవర్‌లూం యజమానులు, ఆసాములు, సెస్ అధికారులు, చేనేత జౌళి శాఖ అధికారులతో కలిసి వస్త్ర పరిశ్రమపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ప్రభుత్వం నుంచి ఆర్డర్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. సిరిసిల్ల సెస్‌కు బకాయి ఉన్నా విద్యుత్ సబ్సిడీ బిల్లులను చెల్లించాలని సూచించారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ ఎండీ రవీందర్‌రెడ్డి, జౌళి శాఖ ఏడీ సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, పాలిస్టర్ వస్త్రోత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శి అంకారపు రవి, కోశాధికారి మండల బాలరాజు, చేనేత వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, నూలు వ్యాపార సంఘం అధ్యక్షుడు పిస్క మధు, గోవిందు రవి, మండల సత్యం, కార్మిక సంఘాల ప్రతినిధులు పంతం రవి, మూషం రమేష్, కోడం రమణ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, సెస్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ



నివాళి అర్పిస్తున్న ఎస్సై అశోక్

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సిరిసిల్లలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ కేరళలో కొండ చరియలు విరిగిపడి 300 మంది మరణించారని, ఎంతో మంది గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సేకరించిన విరాళాలను వరద బాధితులకు అందించనున్నట్లు చెప్పారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణ, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్, సత్యం, సురేష్, పోచమల్లు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వయనాడ్ మృతులకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళ్లు అర్పించారు. ఎస్సై అశోక్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోడికారి హీరోజి, అంబటి శంకర్, మంచె రమేష్, రాజేశం, తిరుపతి, పరాంధామ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛదనం, పచ్చదనం



వేములవాడ ర్యాలీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ముస్తాబాద్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, అగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదు రోజుల స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగింది. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో సమావేశాలను నిర్వహించారు. వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కార్యక్రమాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఫొటోల వివాదం తలెత్తింది. మూడోవార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వచ్చిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి ఫ్లెక్సీలపై ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఫొటోలు లేకపోవడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని నిరసిస్తూ కార్యక్రమాన్ని బహిష్కరించారు. అనంతరం ఇతర వార్డుల్లోని కార్యక్రమాల్లో ఫ్లెక్సీలపై ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే కేటీఆర్, చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి ఫొటోలను ఏర్పాటు చేశారు.



కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

ఓదెల, ఆగస్టు 5: మండల కేంద్రంలో జండా వద్ద రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం పట్టుకున్న నల్లవేని శంకర్ విద్యుదా ఘాతంతో కిందపడిపోయాడు. అక్కడ ఉన్న మెడికల్ షాప్ వద్దకు మందుల కోసం వచ్చిన శంకర్ అనుకోకుండా విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడంతో ప్రమాదం జరిగింది. కిందపడి పోయిన శంకర్‌ను సమీపంలోని యువకులు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదక రంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అక్కడినుంచి తొలగించాలని తెలిపినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

మొరాయించిన రైల్వే గేట్

● అరగంటకు పైగా నిలిచిన రాకపోకలు

మల్యాల, ఆగస్టు 5: మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలోని రామన్నపేటకు వెళ్లే మార్గంలో గల రైల్వే గేట్ సోమవారం సాయంత్రం మొరాయించింది. రైలు రావడంతో అక్కడి సిబ్బంది గేట్లు వేశారు. అయితే రైలు వెళ్లాక అరగంట గడిచినప్పటికీ గేట్లు తెరచుకోకపోవడంతో ఇరువైపుల వాహనాలు, స్కూల్‌బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు పట్టాల మధ్య సాంకేతిక లోపం ఏర్పడడంతో గేట్లు తెరచుకోలేదని గేట్‌మన్ తెలిపాడు. పట్టాల మధ్య సరి చేశాక కాసేపటికీ గేట్లు తెరచుకోవడంతో వాహనదారులు వెళ్లిపోయారు. కొన్ని నెలల క్రితం కూడా ఇలాగే గేట్లు మొరాయించాయి.

చీటి వ్యాపారిపై కేసు నమోదు

మల్లాపూర్, ఆగస్టు 5 : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మొగిలిపేట గ్రామంలో ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన సంగం పెద్దగంగారాం, ముక్కెర లక్ష్మీ కట్టిన చీటి డబ్బులు చెల్లించాలని గంగాధర్‌గౌడ్‌ను పలుమార్లు బాధితులు కోరగా తనకే ఇంకా డబ్బులు రావాల్సి ఉందని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సంఘం పెద్ద మనిషి పెద్దగంగారం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.





బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుమల తిరుపతి తరహాలో

బ్రేక్ దర్శనం అమలు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 : తిరుమల తిరుపతి తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో శ్రావణమాసం మొదటి రోజు సోమవారం బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ఆలయ ఈవో వినోద్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ బ్రేక్ దర్శనం టికెట్ కొనుగోలు చేసి క్యూలైన్ ద్వారా రాజన్న ఆలయంలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు శీఘ్ర దర్శనం కలిగేలా ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. యాదాద్రి తిరుమలతిరుపతి దేవస్థానం తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో కూడా ప్రతి భక్తుడికి శీఘ్రదర్శనం కలిగేలా బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ప్రతీ రోజు ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు బ్రేక్ దర్శనం ఉంటుందని తెలిపారు.

రాజన్న ఆలయానికి గత పాలకులు ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి రూ. 20 కోట్లు నిధులు వెనక్కి తీసుకొచ్చామన్నారు. మొన్నటి బడ్జెట్ రాజన్న ఆలయానికి రూ.50 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, సంఘస్వామి యాదవ్, కనికరపు రాకేష్, తూం మధు, గూడూరి మధు, పుల్కం రాజు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్న ఆలయానికి శ్రావణ శోభ

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయం శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రారంభించిన బ్రేక్ దర్శనం ద్వారా మొదటి రోజున 96 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

శ్రావణ సోమవారం సందర్భంగా అర్చకులు ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండపంలో సాయంత్రం 6.05లకు లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన చేపట్టారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నైమిశారణ్య పీఠం పూజ్యా శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి భక్తులకు శివలీల విలాసం ప్రవచనం వినిపించారు.



ప్రవచనం వినిపిస్తున్న శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి

ధర్మపురిలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

ఆలయాల్లో భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 5: ధర్మపురి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని మొదటి సోమవారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ ఉగ్ర నరసింహ, వేం కటేశ్వర, రామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. రామలింగేశ్వర స్వామి వారలకు మహారుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీని వాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీని వాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభి షేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శివుడికి భక్తి శ్రద్ధలతో పూజలు

రామలింగేశ్వర స్వామి, సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరుని ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి అర్చకులు రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు, అన్నపూజ నిర్వహించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు చేసి, ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, అర్చకులు విశ్వనాథశర్మ, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొండగట్టులో శ్రావణ సప్తాహ ఉత్సవాలు

మల్యాల, ఆగస్టు 5: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస సప్తాహ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ప్రధాన ఆలయ మండపంలో విశ్వక్సేనా రాధన, వాసుదేవ పుణ్య హవచనం, రక్షబంధనం, రుత్విక్‌వరుణం, దీక్ష స్వీకరణ, ఆంజనేయ స్వామికి పంచామృతా భిషేకం,తులసీదళర్చాన, వెంకటేశ్వరస్వామి, అమ్మవారికి అభిషేకార్చన నిర్వహించారు. సాయంకాలం అమ్మవారికి సహస్రనామా కుంకుమార్చన, వేంకటేశ్వర స్వామికి తిరువీధి సేవ నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.ఈ ఉత్సవాలలో ఏఈవో అంజయ్య, స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, అధికారులు సునీల్, చంద్రశేఖర్, సంపత్, ఉమామహేశ్వర్, రాజేందర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 5: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రాజెక్టులోకి 7,822 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది పంప్ హౌస్ నుంచి మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.091 టీఎంసీలు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గిపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం సాయంత్రం నుంచి ఒక మోటార్ నిలిపి వేసి మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఒక పంపును నిలిపివేసి మూడు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మొదటి రెండు రోజులు ఐదు పంపుల ద్వారా రోజుకు 15,750 క్యూసెక్కుల విడుదల చేశారు. మూడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు నాలుగు పంపాల ద్వారా రోజుకు 12,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్ హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 9.8 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 200 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.533 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు ప్రారంభం

ఇల్లంతకుంట: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు సోమవారం ప్రారంభయయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.76 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మధ్యమానేరులో 10.03 టీఎంసీల నీరు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోతలను ప్రారంభించింది. రెండు మోటార్ల ద్వారా 6,400 టీఎంసీల నీటిని ప్రతీ రోజు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయడం ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి విడుదలవుతున్న నీరు

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ఎస్సారెస్పీలోకి 13,167 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం

- రూ. 2కోట్ల ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకున్న వ్యాపారి...?
- సీఎంఆర్ ధాన్యం ఇచ్చింది ఒకరికి... బియ్యం అడుగుతుంది మరొకరిని...!



హుజూరాబాద్, ఆగస్టు 5: జిల్లా సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యంతో సీఎంఆర్ ధాన్యం మాయమైంది. హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ సమీపంలో పరమేశ్వర ఇండస్ట్రీస్ యజమాని ఓరుగంటి సమ్మిరెడ్డి 2016లో తన మిల్లును సత్యనారాయణ అనే వ్యాపారికి లీజ్‌కు ఇచ్చాడు. అప్పటి నుంచి సమ్మిరెడ్డి అనారోగ్య కారణంగా హైద్రాబాద్‌లో కొడుకుల వద్ద ఉంటున్నాడు. ఇదే అదునుగా చూసుకొని సత్యనారాయణ మిల్లు యజమాని సమ్మిరెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి ప్రతి ఏటా ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకుని బియ్యాన్ని ప్రభుత్వానికి పెడుతున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉన్న ధాన్యం రికవరీ చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 2022 సంవత్సరానికి సంబంధించిన సుమారు రెండు కోట్ల రూపాయల ధాన్యం సత్యనారాయణ బాకీ ఉన్నట్లు తేలింది. సివిల్ సప్లయిస్ అధికారులు వచ్చి మిల్లును తనిఖీ చేయగా, ధాన్యం మొత్తం అమ్ముకున్నట్లు తెలిసింది. ఇంతలోనే సదరు వ్యాపారి సత్యనారాయణ అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు సత్యనారాయణకు నోటీసులు పంపించినా ఎవరు స్పందించలేదు. ప్రతి ఏటా మిల్లులో ధాన్యం ఉందా లేదానని చూసుకోవాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడలేదు. అనంతరం సివిల్ సప్లయిస్ అధికారులు మిల్లు యజమాని సమ్మిరెడ్డి వద్దకు వెళ్లి 16 ఏసీకేల బియ్యం సత్యనారాయణ ప్రభుత్వానికి బకాయి ఉన్నాడని, దానిని నువ్వే చెల్లించాలని సమ్మిరెడ్డిని హెచ్చరించారు. తనకు వడ్లతో సంబంధం లేదని, సత్యనారాయణను అడగాలని తెలిపినా సమ్మిరెడ్డికి సివిల్ సప్లయిస్ అధికారులు నోటీసులు పంపించారు. ఈ విషయంపై తనకు సంబంధం లేదని సమ్మిరెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సివిల్ సప్లయిస్ అధికారులపై సమగ్ర విచారణ జరపాలని మిల్లు యజమాని సమ్మిరెడ్డి కోరారు.

వాగులో పడి వ్యక్తి మృతి

ఓదెల, ఆగస్టు 5: మండలంలోని పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి రాజేశం (45) హుస్సేన్ మియా వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేశం ఆదివారం ఉదయం 10 గంటలకు పొలం పనులకు అని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోగా కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం హుస్సేన్‌మియా వాగులో శవం తేలిఉండటంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

'ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి'

రామడుగు, ఆగస్టు 5: వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్యను గొర్రెల దొంగతనం చేశానని ఒప్పుకోవాలని హింసించిన రామడుగు ఎస్‌ఐ సురేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులు సోమవారం సీపీ అభిషేక్ మొహంతికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్, న్యాయవాదుల సంఘం నాయకుడు బీఆర్ఎస్ చొప్పదండి నాయకుడు కట్టెకోల లక్ష్మణ్‌కుమార్, కొంపల్లి సాగర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



రాజశేఖర్ (ఫైల్)

కొడిమ్యాల, ఆగస్టు 5: మండలంలోని పూడూర్ గ్రామంలోని బీరప్పస్వామి గుడి సమీపంలో అదే గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ (30) సోమవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు పూడూర్ గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ గ్రామంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన రాజశేఖర్ తిరిగి రాకపోవడంతో సోమవారం వేకువజామున అతడి తల్లి ఆచూకీ తెలుసుకునేందుకు వెళ్లింది. ఇంటి సమీపంలోని బీరప్పస్వామి గుడి వద్ద రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్న కొడుకును గుర్తించింది. గుర్తు తెలియని వ్యక్తులు రాజ శేఖర్ తలపై కట్టెతో కొట్టి, నోట్లో మట్టి పోసి హత్య చేశారు. అనంతరం నిందితులు రాజశేఖర్ ద్విచక్ర వాహనం నుంచే పెట్రోలు తీసి శరీరంపై పోసి కాల్చడానికి ప్రయత్నించారు. పోలీసుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి చేరుకుని వివరాలు సేకరించారు. రాజశేఖర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. హత్య జరిగిన సమీప ప్రాంతాల్లో కొద్ది రోజులుగా కొందరు యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

తమ కుమారుడిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న పూడూర్‌లో ధర్నా చేశా రు. సమాచారం అందుకున్న మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ధర్నాను విరమించారు.

రెస్టారెంట్ యజమాని ఆత్మహత్య



లక్ష్మీరాజం (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5: వ్యాపారంలో నష్టం వచ్చిందని మనస్తాపంతో సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో కొండ లక్ష్మీరాజం (36) అనే రెస్టారెంట్ అండ్ బేకరీ యజమాని సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీరాజం సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో నివాసం ఉంటూ గాంధీనగర్ కూరగాయల మార్కెట్ వీధిలో అన్‌లిమిటెడ్ రెస్టారెంట్, బెకరీని నడిపిస్తున్నాడు. వ్యాపారానికి రూ.40 లక్షల వరకు పెట్టుబడి కావడంతో అప్పులు చేశాడు. దీంతో తనకు వంశపారంపర్యంగా వచ్చిన స్థలాలను విక్రయించి అప్పులు తీర్చేశాడు. వ్యాపారంలో నష్టం రావడం, ఆస్తి విక్రయించడంతో మనస్తాపం చెందాడు. ఎప్పటిలాగే తన ఇద్దరు కూతుళ్లను స్కూల్‌లో దింపేసి గాంధీనగర్‌లో ఉన్న హోటల్‌కు చేరుకొని వెనుక గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కొంత కాలంగా హోటల్‌లో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులతో తన భర్త లక్ష్మీరాజం ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య వైశాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

నకిలీ ఫోన్‌పే యాప్‌తో యువకుడి మోసం

మంథని, ఆగస్టు 5: నకిలీ ఫోన్ పే యాప్ ద్వారా మోసానికి పాల్పడుతున్న ఓ యువకుడిని మంథనిలో పట్టుకున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు ఈజీ మనీకి అలవాటు పడి ఫేక్ ఫోన్ పే యాప్‌ను తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఈ నకిలీఫోన్ పే ద్వారా ట్రాన్సాక్షన్ చేసినట్టు మాత్రమే కన్పిస్తుంది కానీ ఎదుటి వారి ఖాతాలో ఎలాంటి డబ్బులు జమ కావు. ఈ యాప్ ద్వారా రాజ్ కుమార్ పట్టణంలోని త్రినేత్రి ఆన్‌లైన్ షాపులోని స్కానర్‌కు డబ్బులు పంపించాడు. ఆన్‌లైన్ ద్వారా రూ. 5 వందలు చెల్లించానని, డబ్బులు ఇవ్వాలని కోరాడు. తన ఖాతాలోకి డబ్బులు జమ కాక పోవడంతో అనుమానం వచ్చిన షాపు నిర్వాహకుడు అంబటి సాయి తన స్నేహితుల సాయంతో అది ఫేక్ యాప్ అని నిర్ధారించుకొని అతన్ని పట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా పోలీసులు నిందితుడిని పోలీస్టేషన్‌కు తలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 5: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దాసరి ఓదెలు(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య దాసరి లక్ష్మి కథనం ప్రకారం.. ఓదెలు 5 సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడని, ఆదివారం మధ్యాహ్నం తమ పత్తి చేను నుంచి వెళ్లిన ఓదెలు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని తెలిపింది. చికిత్స కోసం మంథనికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 5: భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని మానసిక వేదనకు గురైన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. ఆరోగ్యం క్షీణించి సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లద్నాపూర్ గ్రామానికి చెందిన పులి లక్ష్మీ తన కూతురు నవ్యను పెద్దపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బాలసాని జంపయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త జంపయ్య వేరే మహిళతో సంబంధం పెట్టుకోగా విషయం తెలిసిన బాలసాని నవ్య (35) మనస్తాపానికి గురై జూలై 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లో చికిత్స అందించారు. అయినా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆర్థికస్తోమత లేకపోవడంతో స్వగ్రామం ముత్తారం తీసుకొచ్చారు. ఆరోగ్యం క్షీణించి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

చిరుత దాడిలో దూడ మృత్యువాత

గంభీరావుపేట, ఆగస్టు 5 : మండలంలోని దమ్మన్నపేట సమీపాన ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి దూడను చంపేసింది. గోరంటాల గ్రామ సమీపంలో ఇటీవల చిరుత దాడిలో రెండు ఆవులు చనిపోయిన సంఘటన మరవక ముందే దమ్మన్నపేట గ్రామ సమీపాన వీరబోయిన నారాయణ అనే రైతుకు చెందిన దూడ చిరుత దాడిలో మృతి చెందింది. పెద్దమ్మ అటవీ ప్రాంత శివారు గ్రామాలైన గోరంటాల, దమ్మన్నపేట రైతులకు చెందిన మూగజీవాలను చిరుత చంపుతుండడంతో భయందోళనలు నెలకొన్నాయి. ఫారెస్ట్ అధికారులు స్పందించాలని, చిరుత బారి నుంచి కాపాడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

వేములవాడ రూరల్, ఆగస్టు 5: గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చరని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మల్లారం గ్రామంలో నూతన పల్లెదవాఖానా భవనానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. రైతాంగానికి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. వేములవాడ పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రూరల్ తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికుడికి రాష్ట్ర స్థాయి పురస్కారం


అవార్డు అందుకున్న దొబ్బల ప్రకాష్

కోనరావుపేట, ఆగస్టు 5 : మండలంలోని సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రేమికుడు దొబ్బల ప్రకాష్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మానుకోట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రేమికుల సదస్సును నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మొక్కల వెంకటయ్య, డాక్టర్ నర్మద, జలగం వీరస్వామి, డాక్టర్ కె కమలారాణి ప్రకాష్‌కు సేవా రాష్ట్ర పురస్కారం అందజేశారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణలో ప్రకృతి ప్రేమికుల సేవలను గుర్తించి రాష్ట్రస్థాయిలో ప్రతీ జిల్లా నుంచి ప్రకృతి ప్రేమికులను ఆహ్వానించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం సంబరాలు నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు లక్ష్మణ్, బాల ఎల్లయ్య, నారాయణ, సత్యం, హనుమంతు, మల్లేశం, వెంకటేశ్, మల్లేశ్, దేవరాజు పాల్గొన్నారు

రెగ్యులర్ ఏంఈవోల నియామకానికి ప్రభుత్వం సానుకూలం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5: రెగ్యులర్ ఎంఈవోల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ త్వరలో ఎంఈవోలను నియమించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కృతజ్ఞత సభలో స్కావెంజర్ల నియామకం, ఉచిత విద్యుత్ వంటివి ప్రకటించారన్నారు. ఈ సమావేశంలో టీఆర్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరెడ్డి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, మెదక్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్, రాష్ట్ర కార్యదర్శి ఆసాని అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన

గంభీరావుపేట, ఆగస్టు 5 : గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును పునఃపరిశీలించాలన్నారు. శీలన చేయాలన్నారు. ు మద్దతు తెలిపిన బీజేపీకి రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సందర్భంగా బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగదండి స్వామి. నాయకులు బండ రమేష్, నల్ల రాజ్ కుమార్, శివ శ్రీనివాస్, భూదయ్య, మల్లయ్య, సత్యం, నర్సింలు ఉన్నారు.

హమాలీల పొట్టగొడుతున్నారు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5: బీహార్, యూపీల నుంచి కూలీలను తీసుకొచ్చి తెలంగాణ వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీలలో పనిచేసే స్థానిక హమాలీల పొట్టగొడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా నాయకులు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. ఐకేపీ, పీఏసీలలో పని చేసే హమాలీలు గ్రామాలను నమ్ముకొని దాదాపు 30 సంవత్సరాలుగా వలసలు పోకుండా పనిచేస్తున్నారన్నారు. స్థానిక హమాలీలను కాదని కొంత మంది స్వార్థపరులు బీహార్, యూపీల నుంచి కూలీలను తీసుకొచ్చి వారితో పనులు చేయిస్తూ స్థానిక హమాలీల పొట్టగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీలు సరిపోని ప్రాంతాలలో బీహార్, యూపీ హమీలీలను పెట్టుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. స్థానిక హమీలీల స్థానాలో పనులు చేసుకోవడం వారి పొట్టకొట్టడమే అన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

వేములవాడ టౌన్, ఆగస్టు 5:వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ సాయి భరత్, శివ, అనిల్, చందు, శివరామకృష్ణ, రిజ్వాన, నవ్య, నేహ, శృతి ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చందుర్తి ఆగస్టు 5: యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో సోమవారం అనుమానిత యువకులకు గంజాయి కిట్‌లతో టెస్టులు నిర్వహించారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దన్నారు. ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుళ్లు, పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల మాటలు అర్థరహితం

వేములవాడ టౌన్, ఆగస్టు 5 : బడ్జెట్‌లో రాజన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించలేదనే బీజేపీ నాయకుల మాటలు అర్థరహితమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాజన్న ఆలయానికి రూ. 50 కోట్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీర్నపల్లి, ఆగస్టు 5 : వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నాయకులు సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రఫీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి


రోడ్లు శుభ్రం చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ టౌన్, ఆగస్టు 5: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని స్థానిక సినారే కళామందిర్‌లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించుకునేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మొక్కల పెంపకంతో ఆక్సిజన్ లభించి జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఇప్పుడు నాటే మొక్కలు భవిష్యత్ తరాలకు మేలు చేస్తాయన్నారు. నాటిన మొక్కలకు ట్రీగార్డు ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించాలని అన్నారు. వేములవాడ పట్టణాభివృద్ధిలో ఎక్కడ రాజీపడేది లేదని, రానున్న రోజుల్లో అన్ని హామీలను అమలు చేస్తామని అన్నారు. రాజన్న ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించామని తెలిపారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, తహసీల్దార్ మహేష్‌కుమార్, కమిషనర్ అన్వేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ కౌన్సిలర్‌లు అన్నారం ఉమా, ఇప్పపూల అజయ్, గోలి మహేష్, నిమ్మశెట్టి విజయ్ నాయకులు సంఘ స్వామి యాదవ్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి, బొజ్జ భారతి, చిలుక రమేష్, అంబటి చంద్రశేఖర్ యాదవ్, తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలి

ముస్తాబాద్: నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను ప్రతీ రోజు నిర్వహించి రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ముస్తాబాద్ మండలంలో సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ఇల్లు, గ్రామం, పట్టణం స్వచ్ఛత, పచ్చదనంతో ఉండాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు లక్ష్యంతో ప్రభుత్వం ఐదు రోజులపాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలన్నారు. ఇంట్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు ప్లాస్టిక్ వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటున్నామో గ్రామాన్ని అలాగే కాపాడుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద నర్సరీలలో మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యుత్ లైన్‌లు, తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్‌లకు దూరంగా మొక్కలు నాటాలని సూచించారు. ఎస్సీ కాలనీలో డంపింగ్ యార్డు తరలింపు సాధ్యాసాధ్యాలపై నివేదికను వారం రోజుల్లో అందించాలని డీపీవోను కోరారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు రుపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. రైతులకు సేంద్రియ ఎరువులు పంపిణీ చేశారు.

విద్యా సంస్థల తనిఖీ.. ఎగువమానేరు కాలువ పరిశీలన

ఎగువమానేరు నుంచి మండలానికి వచ్చే కాలువలో మురుగునీరు కలుస్తున్న ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక రైతు వేదికను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని రైతు వేదికలోకి మార్చాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి మొక్కలు నాటారు. తరగతి గదికి వెళ్లి విద్యాబోధనను పరిశీలించారు. రెండు పాఠశాలకు కావాల్సిన వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులు పరిశీలించారు. కేజీబీవీ ఆవరణలో నీరు నిలవకుండా కాలువ నిర్మించాలన్నారు. కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, డీపీవో వీర బుచ్చయ్య, డీఈవో రమేశ్, డీఆర్డీవో శేషాద్రి, మండల ప్రత్యేకాధికారి లత, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్రీలత, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, నాయకులు అంజనేయరావు, తాళ్ల విజయ్‌రెడ్డి, భాను, దీటి నర్సింలు, అరుట్ల మహేశ్‌రెడ్డి, తలారి నర్సింలు, కొండల్‌రెడ్డి, రంజాని నరేశ్, మంత్రి రాజం, కొండం రాజిరెడ్డి, శీల ప్రశాంత్, ఎలుసాని దేవయ్య, ఎద్దండి మహేందర్‌రెడ్డి, రాగం కుమార్, బాలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అధికారులు సోమవారం 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. గ్రామాలలో ప్రత్యేక అధికారులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగిన ర్యాలీలలో ప్రతీ ఇంట మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ ప్రారంభోత్సవానికి కేకే మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనంతో ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, డీపీవో వీరబుచ్చయ్య, డీఈవో రమేశ్, ప్రత్యేకాధికారి లత, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మండలంలోని ఇందిరమ్మ కాలని తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీఓ మిర్జా, ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి మండలం సారంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మునిగేలా రాజు బహుమతులను అందజేశారు.


ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు రంగంపేట, గర్జనపల్లి, వన్‌పల్లితో పాటు ఆయా గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొదటిరోజు గ్రామసభలను నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మొక్కలు నాటడం నాటిన మొక్కలను సంరక్షిచుకోవడం అందరి బాధ్యతని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మల్లారంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే మన ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. గ్రామంలో ఫీడర్ చానల్‌కు సంబంధించి ఇబ్బందులున్నాయని గ్రామస్థులు తెలిపారని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారు. నూకలమర్రిలో రూరల్ తహసీల్దార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం పాల్గొన్నారు.

చందుర్తి : మండల కేంద్రంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనరావుపేట : గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా ర్యాలీలు నిర్వహించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మురికి కాలువలు క్లోరినైజేషన్‌పై దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్ విజయప్రకాశరావు, ఎంపీడీవో శ్రీనివాస్ మూర్తి, ఆర్ఐ జయంతి, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. గ్రామసభలు నిర్వహించారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీవో సుధకార్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఈవో కార్యాలయం ఎదుట నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 : రాజారాజేశ్వర క్షేత్రంలో బ్రేక్ దర్శనం అమలు సందర్భంలో ఆలయాధికారులు మున్సిపల్ చైర్‌పర్సన్‌ను, స్థానిక కౌన్సిలర్లను ఆహ్వానించకపోవడంపై ఈవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈవో డౌన్ డౌన్ అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవితో పాటు కౌన్సిలర్లు నినాదాలు చేశారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లు చేసిన నిరసన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధిలో అందరినీ కలుపుకు వెళ్తామని చెబుతూ ప్రోటోకాల్‌పాటించడం లేదన్నరు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ఆహ్వానం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

వీర్నపల్లి, ఆగస్టు 5 : తల్లిపాలు పుట్టిన బిడ్డకు ఆరోగ్యానికి ఎంతో మేలని ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లితోపాటు ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అవగాహన కల్పించారు. ఏఎన్ఎం మంజుల, ప్రధానోపాధ్యాయిని సునీత, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, సుష్మ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మర్తనపేట, ధర్మారం గ్రామాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమ్మ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కలప పట్టివేత

చందుర్తి ఆగస్టు 5: మండలంలోని లింగంపేట శివారులోని కొత్తచెరువు అటవీ ప్రాంతంలో నరికి నిల్వచేసిన టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు బీట్ ఆఫీసర్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. కలపను లింగంపేట గ్రామపంచాయతీకి తరలిస్తుండగా తిరుపతి అనే వ్యక్తి మార్గమధ్యలో అడ్డు వచ్చి తనపై దాడికి యత్నించాడని, గ్రామస్తుల సహకారంతో కలపను గ్రామ పంచాయతీకి తరలించానని బీట్ ఆఫీసర్ పేర్కొన్నాడు. దాడికి యత్నించిన తిరుపతిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

కార్మికులపై ప్రేమ ఉంటే ఉపన్యాసాలు మానుకోవాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుండి ఉంటే అప్పుడు నిజంగా సిరిసిల్ల ప్రాంతం, నేత కార్మికులపైన ప్రేమ ఉందనుకునేవారని, నిజంగా కార్మికులపై ప్రేమ ఉంటే ఉపన్యాసాలు మానుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్ ఈ ప్రాంత పద్మశాలీ బిడ్డల ఓటు బ్యాంక్‌తో గెలిచారని, ఈ ప్రాంతలో ఇల్లు కట్టుకొని ఉంటానని మాటలు చెప్పారని అన్నారు. మంత్రి అయినా చేనేత కార్మికుల కష్టాలు తీరలేదన్నారు. బతుకమ్మ చీరల పేరిట సిరిసిల్ల ప్రాంతంలోని కాటన్, డైయింగ్, సైజింగ్ వ్యవస్థను తీశారని, కార్మికులకు పని లేకుండా చేశారని ఆరోపించారు. కార్మికులపై నిజంగా కేటీఆర్‌కు ప్రేమ ఉంటే సిరిసిల్లలో మూతబడిన శ్రీరాజరాజేశ్వర్ స్పిన్నింగ్ మిల్లును ప్రభుత్వసహకారంతో నాడు నడిపిస్తే దాదాపు 1200 మంది మహిళలకు ఉపాధి లభించేదన్నారు. ప్రభుత్వ పాలసీ ద్వారానే బతుకమ్మ చీరల ఉత్పత్తి చేశారు కాబట్టి ఆ బకాయిలను తీర్చే బాధ్యతను తాము తీసుకున్నామని, రూ. 100 కోట్ల వరకు చెల్లించామని అన్నారు. మిగిలిన డబ్బులు ఇచ్చే బాధ్యత తమదేనన్నారు. ప్రభుత్వం నేతకార్మికుల సమస్యలను గుర్తించి దీక్షను విరమింప జేసిందన్నారు. బతుకమ్మ చీరల స్కాంలపై ముఖ్యమంత్రి విచారణ జరుపతామంటే కేటీఆర్ నోరు విప్పలేదన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, కౌన్సిలర్లు వేముల రవి, కుడికాల రవికుమార్, భూక్య రెడ్యానాయక్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, భీమారం శ్రీనివాస్, గుండ్లపెల్లి గౌతమ్ పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో రూ.9లక్షల 26 వేల కోట్ల నిధులు


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 : బీజేపీ ప్రభుత్వం గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో రూ.9 లక్షల 26 వేల కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిందని ఆ పార్టీ శాసనసభ పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే యేలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదనే వారికి ఒక్కటే ఇది ఒక్కటే సమాధానమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.80 వేల కోట్ల అభివృద్ధి పనులు నడుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడానికి రూ.3.5 లక్షల కోట్లు అసరం పడుతుందని, కేవలం బడ్జెట్‌లో మాత్రం రూ. 33 వేల కోట్లు మాత్రమే కేటాయించి పొంతన లేకుండా చేశారని విమర్శించారు. అంతకుముందు కుటుంబసమేతంగా రాజరాజేశ్వరస్వామిని దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం, అధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ముందుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. రాజన్న ఆలయ పీఆర్వో సిరిగిరి శ్రీరాములు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బాలరాజు, మల్లేశం యాదవ్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణ అంశాన్ని పునః పరిశీలించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పునః పరిశీలించాలని, రాజ్యాంగ బద్ధమైన న్యాయం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోరింది. సమితి ఆధ్వర్యంలో మాల, ఉప కులాల సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ బద్ధంగా. న్యాయబద్ధంగా లేదని ఆరోపించారు. ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీం కోర్టు ఐదుగురు జడ్జిల ధర్మాసనం ఇచ్చిన తీర్పును పూర్తిగా పరిగణలోకి తీసుకోకుండా ఆరుగురు జడ్జిల రాజ్యాంగ స్ఫూర్తిని పరిగణలోకి తీసుకొని తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. ఆరుగురు జడ్జిల అభిప్రాయాలతో ఒక న్యాయమూర్తి త్రివేది పూర్తిగా ఏకీభవించలేదని కాబట్టి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ బద్ధంగా లేనట్లుగా భావిస్తున్నామని అన్నారు. అంతకుముందు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాలల జేఏసీ జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మంగ కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాలుక సత్యం, గణేష్, తుంగ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ ప్రతినిధి అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగిడి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. నిత్యావసరాలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు. అంతకుముందు కార్యాలయంలలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ ఉపాధ్యక్షులు మారుతి, అరుణ్, శివప్రసాద్, సోహిదల్, వరుణ్‌కుమార్, అభిలాష్, రాకేష్, భార్గవ్, సంజీవ్, రాజు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు

నేత కార్మికులకు జీవనభృతి చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికుల

సిరిసిల్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉండడంతో పవర్‌లూం కార్మికులు పస్తులతో అవస్థలు పడుతున్నారని, రూ.5 వేల జీవన భృతి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్, ఎర్రజెండా పవర్‌లూం కార్మిక సంఘం (న్యూ ఏఐఎఫ్‌టీయూ) డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్లలో జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట వంటావార్పు, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ ప్రభుత్వం గడిచిన ఏడు మాసాలకు సంబంధించి ప్రతీ కార్మికునికి రూ.5 వేల జీవనభృతి ఇచ్చి ఆదుకోవాలన్నారు. గత కూలి ఒప్పందాన్ని యథావిధిగా అమల్లో ఉంచి కార్మికుడికి బోనస్‌గా ఏటా రూ.1200 చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ర్యాలీగా కార్యాలయానికి తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. ఈ కార్ర్యమంలో పవర్‌లూం కార్మిక సంఘం కన్వీనర్ బొద్దుల శ్రీహరి, తడుక రాములు, గుజ్జె దేవదాస్, గడదాస్ ప్రవీణ్, సత్యనారాయణ, గోనె శ్రీధర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన ర్యాలీ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5: కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పోలీసులు అమలు చేయకుండా కక్షిదారులపైనే కేసులు నమోదు చేస్తున్నారని సిరిసిల్ల పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి మాట్లాడారు. పోలీసులు కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా కక్షిదారులపైనే కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సివిల్ కేసుల్లో జోక్యం చేసుకవడమే కాకుండా కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 1నుంచి కోర్టు విధులను నిరవధికంగా బహిష్కరించామన్నారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేసిన సంబంధిత పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, కోశాధికారి బిట్ల విష్ణు, క్రీడల కార్యదర్శి గుడ్ల కిషన్, గ్రంథాలయ కార్యదర్శి శశాంకం, సీనియర్ న్యాయవాదులు ధర్మేందర్, కోడి లక్ష్మణ్, ఆవునూరి రజనీకాంత్, గోవింద్ భాస్కర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు